


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### పారా హుషార్...

**అమితాబ్‌బచ్చన్** తల కిందకి వంచుకుని ఉన్నాడు. నేను ఇంకా గట్టిగా కోప్పడ్డాను. "హక్కా నూడిల్స్ చెయ్యమంటే మాగి నూడిల్స్ చేసావేంటి? ఆయ్?"

అమితాబ్ "మై బోత్ షర్మిందా హూ!" అన్నాడు.

లైట్‌గా కళ్ళల్లో తడి! నా మనసు కరిగిపోయింది. ఎంతైె నా ఊహ వచ్చి కన్ను తెరిచినప్పటి నుండీ నా అభిమాన నటుడు. అతని సినిమాలు చూస్తూ పెరిగి పెద్దదాన్నయ్యాను. ఈ చిన్న తప్పిదాన్ని క్షమించలేనా?

అమితాబ్ దగ్గరకు వెళ్ళి భుజం మీద చెయ్యి వేద్దాం అంటే అందలేదు. స్టూల్ కోసం చూస్తున్నా. మా వారు "తోటకూర కుక్కర్‌లో పెట్టొచ్చా? " అని మా మధ్యలోకొచ్చారు.

పట్టించుకోవద్దు అని, అమితాబ్ భుజం వైపు మళ్ళీ చూసా.

"తోటకూర కుక్కర్లో పెట్టొచ్చా?" ఈసారి మా వారి మొహం మరీ దగ్గరగా. అమితాబ్ ఇంకా సిగ్గుపడి మరీ వెనక్కి వెళ్ళిపోయాడు.

నేను చిరాగ్గా "మధ్యలో మీ తోటకూర ఏవిటీ?" అన్నాను.

"మధ్యలో ఏవిటీ? మొదటా.. చివరా నేనే" అని శ్రీశ్రీ లెవెల్లో గరిట పట్టుకుని తిప్పుతూ చెప్పారు మా ఆయన.

నేను కంగారుగా అమితాబ్ కోసం చూసా! ఇంకెక్కడ అమితాబ్? మాయం అయిపోయాడు పాపం. నేను కోపంగా "అందలాల కుందలాల మీద అత్తగారిని తీసుకొస్తే తోటకూరకి ఎసరు ఎంత పెట్టాలి? అందిట.. అలా ఉంది. తోటకూర కుక్కర్లో పెట్టడం ఏవిటీ? ఇంత మాత్రానికి నా అమితాబ్‌ని హడలగొట్టి పంపించెయ్యడం ఏవిటీ?" అన్నాను.

"అమితాబ్ ఏవిటి మధ్యలో" అన్నారు.

"తెల్లవారుఝామున కలలు నిజం అవుతాయా?" అడిగాను.

"అవుతాయేమో కానీ ఇది మిట్టమధ్యాహ్నం. సూర్యుడు నడినెత్తిన ఉన్నాడు" అన్నారు కోపంగా.

"అమితాబ్‌ని హక్కా నూడిల్స్ చెయ్యమంటే మేగీ చేసాడని తిట్టానండీ" బాధగా అన్నాను.

"ఒకవేళ అది తెల్లవారుఝామునా, అమృత ఘడియల్లో వచ్చినా నిజంకాదు. అమితాబ్ కేం ఖర్మ నాలాగా వంట చేసిపెట్టడానికి?" అన్నారు దుగ్ధగా.

"అసలు అమితాబ్ వంట చేస్తున్నట్లు కలరావడం ఏవిటీ?" ఓ నిమిషం ఆలోచించా.. "ఆ! అర్థమైంది. మేగీ నూడిల్స్ గురించి ఎడ్వర్టైజ్ చేసాడుగా. అందుకని తిట్టా" అన్నా షెర్లాక్ హోమ్స్‌లా.

"డబ్బులిస్తే వాళ్ళు ఏవైనా చెప్తారు. నీకూ ఓ పదిలక్షలిస్తే 'పందిమార్క్ సోప్ వాడండీ... నా చర్మసౌందర్యానికి అదే కారణం" అని చెప్పమంటే చెప్పవా? " అన్నారు.

"చెప్పను" కోపంగా అన్నాను.

"యాభై లక్షలిస్తే?" కొంచెం ఆలోచనలో పడ్డాను.

"పోనీ.. కోటి!" అన్నారు.

"చెప్పొచ్చు" అన్నాను.

"వచ్చినట్టు చెప్తావ్.. పైసా మే హై పరమాత్మా!" అన్నారు.

"అయినా చూసేవాళ్ళు ఎట్లా నమ్మి చస్తారండీ?" అన్నాను విసుగ్గా.

ఆలియా భట్‌కీ వాళ్ళమ్మకీ తలమీద పెరిగే జుట్టు జిడ్డు లేకుండా ఉంటే చాలు. అని ప్రకటన లేదూ?

అసలు ఏవిటండీ ఈ ప్రకటనలు? జనాలు చెవిలో గోబీ పూలో, పొద్దు తిరుగుడు పూలో పెడ్తున్నట్లు... కేవలం ఆరు వారాలలో మొహం తెల్లబడిపోతుందటా.. అది చాలుటా. మిగతా శరీరం? మెడా, చేతులూ చూడరా? అసలు తెల్లగా మారడం ఆత్మస్థైర్యాన్ని ఇస్తుందనే వాళ్ళని జైల్లో పెట్టాలి. రేసిజమ్ కదూ.

పెళ్ళికి ముందు మా అత్తగారు నన్ను చూసి "కోడలు నలుపు అయితే కులమెల్లా నలుపే అవుతుంది" అని తెగ బాధపడ్డారు. ఆ బాధ చివర వరకు ఉంది. నేను "ఫెయిర్ అండ్ లవ్‌లీ" వాడలేదు మరి. ఒక వేళ మొత్తం శరీరం తెల్లబడాలంటే డ్రమ్ నిండా ఫెయిర్ అండ్ లవ్‌లీ నింపి, దానిలో కూర్చోవాలి నేను. నేను మాములుగా ఉంటాను. వాళ్ళు చాలా తెలుపు. అంటే వాళ్ళింట్లో గుమ్మడిపండు పక్కన మా వారిని కూర్చోపెడితే ఎవరు పిల్లాడో తెలిసేదికాదంట. (అతిశయోక్తిలెండి) బంగారు మొలతాడు కనిపించేది కాదట.

అదిసరే నా గోల కేం కానీ. ప్రకటనల సంగతి కొస్తే - మీ పేస్టులో ఉప్పుందా? మీ బాత్‌రూమ్ క్లీన్‌గా ఉందా అంటూ జబర్దస్తీగా మన బాత్‌రూంలోకి సిగ్గులేకుండా వచ్చేయడం.

"అమ్మా మేం సహజీవనం చేస్తున్నాం" అని కొడుకు ఓ అమ్మాయి చూపిస్తే తల్లి మొహంలో ఆశాభంగంతో కూడిన షాక్. కానీ ఆ అమ్మాయి హడావిడిగా చున్నీ కప్పుకుని టీ తెస్తే "ఆయనకి సుగర్", "ఇందులో వెయ్యలేదు. మీకు రెండు స్పూన్స్ వేసాను" అనగానే ఆ టీ తాగి "ఈ బ్రాండ్ టీ వాడితే నువ్వేం చేసినా ఓకేరా అబ్బాయ్" అన్నట్లు మొహంలో ఆనందం అమ్మకి.

తండ్రి అర్థరాత్రి సడెన్‌గా కూతురి గదిలోకి వస్తే, బోయ్ ఫ్రెండ్‌ని తలుపు చాటున దాచేస్తుంది. ఇంతలో అతని సెల్‌ఫోన్‌కి మెసేజ్. ఆ సౌండ్‌కి తలుపు చాటున ఉన్న కూతురి బోయ్ ఫ్రెండ్‌ని చూసిన తండ్రి రియాక్షన్... క్రోధంగా మారదు. "ఇది ఎంత?" అని అడిగి సెల్‌ఫోన్ 4,999/ - మాత్రమే అని తెలిసి, మొహం ఆనందంతో వెలిగిపోతుంది. "ఈ వేళప్పుడు నా కూతురి గదిలో ఏం చేస్తున్నావ్?" అని అడగడు. ఆ సెల్‌తోనే మురిసిపోతూ వెళ్ళిపోతాడు.

ఇంకొక ఆటగాడు, తన ప్రఖ్యాతమైన ఫేస్ కనపడకుండా మాస్క్ పెట్టుకున్నా సరే, అదేదో స్ప్రే కొట్టుకుంటే ఆడపిల్లలు అతని మీద మిఠాయి మీద ఈగల్లా ముసిరిపోయినట్లు చూపిస్తున్నారు. మరి ఆడపిల్లలు అందుకు నిరసన చూపడం లేదు ఎందుకో?

ఇంక లిఫ్ట్‌లోనే కొందరు అమ్మాయిలు ఈ ఏక్స్ స్ప్రే ఏడ్‌లో.. అన్నీనూ! ఏవిటీ వాణిజ్య ప్రకటనలూ?

మొన్న ఫేస్‌బుక్‌లో కిరణ్‌ప్రభగారు 1940నాటి షణ్ముఖం నశ్యం ఏడ్ పోస్ట్ చేసారు. భలే ఉందది. గాయకులు శృతి పక్వంగా పాడాలన్నా.. ఆఫీసులలో గుమస్తాలు చురుకుగా లెక్కలు చూడాలన్నా.. రచయితలు మంచి రచనలు చేయాలన్నా.. వాడండి షణ్ముఖం నశ్యం. ఇన్ని తులాలు, ఇన్ని నయాపైసలు (అప్పట్లో అంతే) ఇలా సాగిందా ప్రకటన. ఎంత బావుందీ?

అందులో అతిశయం ఉన్నా, ఎవర్నీ బాధపెట్టేదిలేదు. సినీతారల సౌందర్య సాధనం లక్స్ సబ్బు ఎంతోకాలం ప్రాచుర్యం పొందింది. చందమామల్లో 'రెమీ' టాల్కం ఏడ్‌లో పాత తారల అందాలు కనువిందు చేసేవి. నిండుగా చీరలు కట్టి 'మొహ' సౌందర్యం మాత్రం చూపించేవారు, ఇంక కేసరీ కుటీర వారి ప్రకటనలు సరే సరి.

ఈ ఏడ్ ఫిల్ములు అన్నవి కూడా డైరెక్టర్, ప్రొడ్యూసర్ల క్రియేటివిటీకి సంబంధించినవి. ఈ మధ్య నాకో ఏడ్ తెగ నచ్చింది.

ఓ అమ్మాయిని తీసుకొచ్చి, రూం మేట్‌తో "వీ ఆర్ మూవింగ్ ఇన్ టు గెదర్" అనగానే, పాపం ఈ అమాయకుడు "ఓ! దట్స్ ఎమేజింగ్.." అంటాడు. అంతలోనే అతని ఫేస్‌లో ఎక్స్‌ప్రెషన్ చేంజ్ అవుతుంది. తను బయటకి పోవాల్సిన సిట్యుయేషన్ అని అర్థం అవుతుంది. అది సెల్‌లో ఫలానా ఏప్ డౌన్‌లోడ్ చేసుకోండి, ఇళ్ళవేట కోసం అనే ఏడ్ కానీ ఇక్కడ ఓ ముఖ్యమైన సంగతి మనం గమనించడం లేదు. ఈ ఇల్లు వెతుక్కోడం ఏప్ మీద మన కాన్సన్‌ట్రేషన్ పోతోంది కానీ, 'మూవింగ్ ఇన్ టు గెదర్' మీద మన దృష్టి పోవడం లేదు. అది చాపకింద నీరులా మన సంస్కృతిలో భాగం అవుతోంది. ఏదైనా సినిమాలో చూపించినా 'సమస్య' అనుకుంటారు. చూసి వదిలేస్తారు. కానీ టీ.వీలో ఏడ్స్‌లో వస్తే అది నిత్యజీవితంలో భాగం అవుతుంది.

విక్స్ వెపరబ్ ఏడ్‌లో "కుచ్ లేతే క్యా నై?" అన్నది మనకి ఎంతో అలవాటై, ఎవరైనా తుమ్మగానే "కుచ్ లేతే క్యో నై?" అని అడగాలనిపించేది.

అలాగే విక్స్ వెపరబ్ 'తల్లి చేత్తో రాస్తే' ఎంతో ఉపశమనం అన్నది కూడా మన మెదళ్ళల్లో ఫీడ్ అయ్యేది.

విమ్ ఏడ్‌లో పాత్రలు మురికిగా ఉంటే, పెళ్ళాం వైపు కోపంగా చూసే ఏడ్ ఇది వరకొచ్చేది. ఇప్పుడు విమ్ బార్‌తో మొగుడూ, పెళ్ళాం కలిసి అంట్లు తోముకునే ఏడ్స్ వస్తున్నాయి.

"అనుష్కాశర్మ" మోపెడ్ మీద వెళ్తుంటే కామెంట్ చేసిన కుర్రాళ్ళని వెంటాడి, చేజ్ చేసి, బాగా ఏడిపించి కానీ వదిలిపెట్టదు. "మా బట్టలు.. మా ఇష్టం. మీరెవరు కామెంట్ చెయ్యడానికి?" అనే భావవిప్లవం ఆడపిల్లల్లో వచ్చేసింది.

ఆడపిల్లల శానిటరీ నేప్‌కిన్స్ ఇప్పుడు వాళ్ళ ప్రైవేటు విషయం కానేకాదు. అవి లేకపోతే వీళ్ళు తమ తమ రంగాలలో ప్రగతి సాధించలేరుట. మా అమ్మమ్మల తరాలలో ఏం చేసారో కానీ, వాళ్ళల్లో బ్రిటీషు వారిని ఎదిరించి మా అమ్మమ్మలా జైళ్ళలో ఉన్న ఆడవాళ్ళూ, సత్యాగ్రహాలు చేసిన వాళ్ళూ, రాత్రీ పగలూ ఇంటికొచ్చిన వారికి అన్నవ్రతాలు చేసిన వాళ్ళూ ఉన్నారు. కానీ ఈ కమ్‌ఫర్ట్స్ ఆడపిల్లలకి స్వేచ్ఛనీ, పని ఎక్కువగా చేసే సామర్థ్యాన్నీ ఇవ్వడం నిజం. కానీ ప్రకటనలకి ఒక పరిమితి ఉండాలి. దేనికైనా పరిణితీ.. పరిమితీ అవసరం.

మొహం తెల్లగా ఉంటే ఆత్మ విశ్వాసం ఉండాలి అనే ప్రకటనలు చేసేవాళ్ళు స్మితా పాటిల్, నందితా సేన్, వాణిశ్రీ లాంటి గొప్ప నటీమణులని చూదలేదా? పైగా ఈ రంగు ఆడవారికే ముఖ్యమా?

ఇంక టీ.వీ సీరియల్స్ ప్రభావం కూడా మన నిత్య జీవితం మీద చాలా ఉంటుంది. ఇటీవల బాగా ప్రాచుర్యం పొంది మన నట్టిళ్ళల్లో తిష్ట వేసుకుని కూర్చున్న హిందీ సీరియళ్ళలో విషయాలు ఏవిటంటే 'బాల్య వివాహాలు', 'వెట్టి చాకిరీ', 'బాలవితంతువులు', 'చాతబడులు.'

పాపం మన వీరేశలింగం పంతులుగారూ, రాజారామమోహనరాయ్ లాంటి పెద్దలు ఈ సాంఘిక దురాచారాలు రూపుమాపడానికి ఎన్ని దశాబ్దాలు అవిశ్రాంతంగా కృషి చేసారో కానీ, మన టీ.వీ ఛానెళ్ళ వారు ఓ ఎపిసోడ్‌లో మళ్ళీ ప్రజాజీవితంలోకీ, వెలుగులోకీ తెచ్చారు.

చిన్నప్పుడే పెళ్ళయిన ఓ పిల్ల కథ విజయవంతంగా హిందీలోంచి అన్ని భాషల్లోకీ అనువదింపబడి ఆడవారిని టీ.వీ తెరలకి అతుక్కుపోయేట్లు కొన్ని ఏళ్ళుగా కట్టి పడేసింది.

నిండా ఐదేళ్ళు లేని పసిపాపని కడుపులో ఉండగానే బానిసగా కొనుక్కున్న కథ. ఇప్పుడే తెలుగులోకి వచ్చి ఆడ, మగా, ప్రతిరోజూ కంట తడిపెడ్తూ విడవకుండా చూసేట్లు చేస్తోంది.

ఇంక అత్తాకోడళ్ళ సీరియల్స్ ఎప్పుడూ హాట్ చాక్లెట్సే. అత్త ఎన్ని రకాలుగా కోడళ్ళని కష్టపెట్టచ్చో చెప్పే సీరియల్స్ కొన్నైతే, అత్తని ఎన్ని రకాలుగా హింసించచ్చో నేర్పించేవి కొన్ని. ఇవి మాత్రం ఎన్ని శతాబ్దాలైనా మారవు. వీటికి రేటింగ్ దోఖా లేదు అని సదరు టీ.వీ ఛానెళ్ళ యాజమాన్యం అభిప్రాయం.

మొన్న తీరిగ్గా కూర్చుని సప్తగిరిలో 'శ్రీలక్ష్మమ్మ కథ' సినిమా చూసాను. అమ్మ బాబోయ్.. అదేం అత్తగారూ? అదేం ఆడబిడ్డా? శ్రీలక్ష్మిని ఎన్ని రకాల హింసలు పెట్టారో? అన్నం నీళ్ళూ ఇవ్వకుండా స్తంభానికి కట్టేసారు. అంజలీదేవి కన్నా కైవారంలో పెద్దగా ఉన్న బిందె ఇచ్చి కాలవ నుండి నీళ్ళు తెమ్మన్నారు. మన డ్రాయింగ్ రూం అంత సైజులో ఉండే తిరగలితో పిండి విసురుతున్నారు. అవి మొయ్యలేక పడిపోతే ఇంకా కొట్టారు పాపం.

మొగుడు లేడా అంటే ఉన్నాడు. ఎవరోకాదు మా అక్కినేని నాగేశ్వరరావుగారు. ఆయనకి సినిమాలో రెండే డైలాగులు "వెధవ ఆడపెత్తనం.. బోడి పెత్తనం", "నేను సానిదాని దగ్గరకి పోతా.. వెధవ పీడ ఈ సంసారం" ఇవి రెండే

చివరకి శ్రీలక్ష్మమ్మ చచ్చిపోయాక, మొగుడికీ, అత్తకీ, ఆడబిడ్డకీ కళ్ళుపోతాయి. ఆవిడ దేవతగా వెలుస్తుంది. బహుశా బాక్సాఫీసు బద్దలు కొట్టి ఉంటుంది ఆరోజుల్లో. అదే చిట్కా ఇప్పటికీ లేడీ ఓరియంటెడ్ కథలు. అందులోను ఏడుపు గొట్టువి 'బార్క్' రేటింగ్ కొల్లగొడ్తాయి. ఈ మనస్తత్వం మనలోనే ఉంది. హీరోయిన్ కష్టాలు తీరిపోతే ఇంక ఆ సీరియల్ చూడరు.

వ్యాపారాత్మక ధోరణులూ, వాణిజ్య ప్రకటనలూ మన జీవితాల్లో ఎంతగా పేరుకుపోయాయి అంటే, సినిమా తియ్యడానికి ఎంత ఖర్చు అవుతుందో, దాన్ని పబ్లిసిటీ చేసుకోవడానికీ అంతే ఖర్చు అవుతుందట. అలా ఎన్నో మంచి మంచి సినిమాలు, డబ్బు లేక పిందెగానే వాడిపోయిన సందర్భాలున్నాయి. బాగా డబ్బుంటే ఏ సినిమా అయినా ఓ ప్రభంజనంగా, అంటురోగంలా ప్రబలేటట్లు చెయ్యచ్చు.

ఇంక గవర్నమెంట్ ఈసారి తన ప్రచారశాఖకి పని చెప్పి 'పుష్కరాల'కి బాగా పబ్లిసిటీ చేయించింది. దాని ఫలితంగా 'చేసిన పాపాలన్నీ కడుక్కోడానికి అప్పటిదాకా పుష్కరం అంటే అర్థం తెలీని వాడు కూడా పరిగెడ్తున్నాడు. 'వంద అశ్వమేధాల ఫలితం..' 'కోటి అన్నదానాల పుణ్యం' ఇవన్నీ ఒక్క మునకలో వస్తాయి అంటే మరి టెంప్టింగ్‌గా ఉండదూ? అందరూ ఆఫీసులు మానేసి పుష్కరాలకి వెళ్ళేవాళ్ళే. ఆఫీసర్‌కి లీవ్ ఇవ్వను అనడానికి భయం. పాపం వస్తుందేమో అని.. మా డ్రైవర్ కుమార్ కూడా "పుక్షరానికి పోతా లీవ్ కావాల" అన్నాడు.

"ఒరేయ్ కరెక్ట్‌గా పలికితే లీవ్ ఇస్తా" అన్నా. వాడికో పుష్కరం పడ్తుంది పలకడానికి అని. అసలు మా డ్రైవర్ లీవ్ అడగడానికి కారణాలు అక్కర్లేదు. నిన్న 'రంజాన్' లీవ్ కావాలన్నాడు. అటు మొన్న 'బాహుబలి' రిలీజ్ ఉంది లీవ్ కావాలి అన్నాడు. నెలకి ఇన్ని లీవులు అని లెక్కా, లీవ్ కావాలంటే అప్లికేషన్ పెట్టడం వీళ్ళకి లేవుగా. సాధారణంగా నేను కాదనను. కాదన్నా వెళ్ళిపోతాడుగా.

ఇంతకు ముందు 'నర్సింగ్' అనే డ్రైవర్ ఉండేవాడు. ఓసారి తెగ ఆశ్చర్యపోయాడు "అమ్మా ఊళ్ళో ఆస్పత్రులన్నీ నా పేరు మీదే ఉన్నాయి" అని. నేను మొదట ఆశ్చర్యపోయి, తర్వాత తెలుసుకున్న విషయం ఏంటంటే.. ప్రతి ఆస్పత్రి మీదా 'నర్సింగ్ హోమ్' అని ఉండడం వాడికి నచ్చేసింది. అన్నీ తన పేరు మీదే ఉన్నాయి అనుకున్నాడు. ఆ మాత్రం తెలివి మాత్రమే ఉన్నవాళ్ళని ఏరి నేను నా దగ్గర పెట్టుకుంటాను.

ఇంకోసారి వాడి ఫ్రెండ్స్ నీ పేరులో 'సింగ్' అని ఉందిగా మరి నెత్తిమీద 'పగ్డీ' పెట్టుకోలేదే?" అని అడిగాడని నాకు చెప్పాడు. అతని స్నేహితుడికి ఆ తరువాత నా దగ్గర పని ఇచ్చాను.

***నీతి ఏవిటంటే మన దగ్గర పని చేసేవాళ్ళు మనకన్నా ఎక్కువగా తెలివిగా ఉండకూడదు.***

అసలు ఈ అమితాబ్‌గారు 'మేగీ' న్యూడిల్స్ తినండి.. కేవలం రెండు నిమిషాల్లో అని తెలుగు నేర్చుకుని మరీ మన వెంట ఎందుకు పడ్డాడంటే, ఆయన దానికి బ్రాండ్ ఎంబాసిడర్. మరి అందులో ఏవో కెమికల్స్ ఉన్నాయి అని బ్యాన్ చేసినప్పుడు 'నాకేం తెలుసూ?' అని తప్పుకున్నారు. నిజమే.... మన నాగార్జున కళ్యాణ్ జ్యువెలర్స్‌లో బంగారం కొనమంటాడు... జూ.ఎన్.టీ ఆర్ మలబార్‌లో.. ఇంక వెంకటేష్ అవన్నీ 'మణప్పురం'లో దాచమంటాడు. వెంకటేష్‌ని అడిగితే ఏం అంటాడూ? నాగార్జునకి ఏం తెలుసూ? మనమే చూసి కొనుక్కోవాలి.

కానీ నా అమిత్‌జీకి ఒక రెపుటేషన్ ఉంది ఆయన ఒక్కడూ వచ్చి చెపితే వినమేమో అని కోడలు ఐశ్వర్యగారితో మరీ కలిసొచ్చి 'పోలియో డ్రాప్స్.. దో బూంద్..' వేయించమంటే మన జనం విన్నారు. అలాగే 'దో మినిట్' అని మేగీ గురించి చెపితే జనం ఎగబడ్డారు. పెద్దాయిన అంటే నమ్మకం అలాంటిదీ. ఈ మధ్య ఏదో బంగారుకొట్టు అడ్వర్‌టైజ్ మెంట్‌కి, ఓపెనింగ్ ఆర్భాటంగా చేసి, మన దక్షిణాది అగ్రనాయకులకీ, అమితాబ్‌గారికీ ఐశ్వర్యా బచ్చన్ గారికి కూడా బంగారు పళ్ళాలలో భోజనం పెడితే ఆ ఫోటో ఎఫ్.బిలో 'హల్‌చల్' చేసింది.

నన్ను అడిగితే పళ్ళెంలో పెట్టిన పదార్థం రుచే ముఖ్యం కానీ పళ్ళెం ఏ లోహంతో చేసారని కాదండీ. అయినా నన్నెవరు అడుగుతార్లెండి? కానీయండి...

Post your comments

